క్లుప్తంగా

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత



వర్ధన్నపేట: వర్ధన్నపేటకు చెందిన ఎండీ జలీల్ తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకోగా సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్‌ను ట్రేస్ చేసి స్థానిక ఎస్సై ప్రవీణ్‌కుమార్ జలీల్‌కు ఆదివారం అందజేశారు. జలీల్ ఆగస్టులో తన ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. తన ఫోన్ పోయిందని ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మొబైల్ ఫోన్‌ను ట్రేస్ చేసి జలీల్‌కు అందజేశాడు.

ప్రధాని మోదీకి స్వాగతం పలికిన ఎన్ఆర్ఐ



నర్సంపేట: నర్సంపేట పట్టణానికి చెందిన ఎన్ఆర్ఐ పిన్నా భాస్కర్‌కు అరుదైన అవకాశం దక్కింది. అమెరికా పర్యటనలో భాగంగా క్వాడ్ మీటింగ్‌కు డెలావెర్రా రాష్ట్రం విల్మింగ్టన్ సిటీకి ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెళ్లారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ భాస్కర్ డెలావేర్రా ఇండియన్ కమ్యూనిటీ లీడర్ షిప్ నుంచి ఆహ్వాన కమిటీ మెంబర్‌గా అవకాశం దక్కింది. డెలావేర్రా సిటీకి వచ్చిన మోదీకి స్వాగతం పలికారు.

ఎమ్మెల్సీకి 'మెపా' కృతజ్ఞతలు



చెన్నారావుపేట: గత కొన్నేళ్లుగా ముదిరాజ్‌ల ఐక్యత కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు మెపా వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని క్యూ న్యూస్ కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపికను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌ల చరిత్రను, సంస్కృతి సంప్రదాయాలను మల్లన్న అవగాహన పరిచారని అన్నారు. ముదిరాజ్‌లలో ఉద్యమ స్ఫూర్తి నింపాడన్నారు. బీసీ కులగణన ఉద్యమాన్ని ఎత్తుకున్న మల్లన్నకు మెపా మద్దతుగా ఉంటుందని అన్నారు. ఆయన వెంట మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిరుత వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శులు దండు చిరంజీవి, రాజు, సభ్యులు కృష్ణ, దుండి అశోక్, రమేష్, సురేష్ ఉన్నారు.

ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం



రాయపర్తి : ప్రజలకు సేవ చేయడమే ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ లక్ష్యమని, కావాలనే కొంత మంది ఇటీవల తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఎస్ఆర్ఆర్ అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని కొండూరులో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహానికి రూ.21వేలు, కాట్రపల్లిలో రూ.15వేల చొప్పున అందించారు. అనంతరం మండలకేంద్రానికి చెందిన ఐత యాకయ్య, యాకమ్మ కుమార్తె సౌజన్య డెంగీతో బాధపడుతుండగా ఆమెతో పాటు మరోవ్యక్తికి రూ.3 వేల చొప్పున రూ.6 వేల ను ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్‌నాయక్‌రాథోడ్‌తో ఆర్థిక సహాయం పంపించినట్లు చెప్పారు. కార్యక్రమాల్లో ఫౌండేషన్ ప్రతినిధులు వల్లాల సుధాకర్, గ్రామస్తులు కేశవరెడ్డి, పుల్లా ఎల్లగౌడ్, దుర్గామాత కమిటీ సభ్యులు గిర్క సురేష్, భిక్షపతి, మధు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గౌరవ వేతనం ఇవ్వాలి

పరకాల/దామెర: రేషన్ డీలర్లకు గౌరవవేతనం ఇవ్వాలని డీలర్ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి ఆదివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.5వేల గౌరవవేతనం అందజేయాలని కోరారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించాలన్నారు. దామెర మండల అధ్యక్షుడు సదిరం పోశాలు, వివిధ మండలాల అధ్యక్షులు వాణిరాజు, శంకర్‌రావు, రాజేందర్ రెడ్డి, ఉమేందర్ గౌడ్, సర్వేశం, పోచయ్య తదితరులు ఉన్నారు.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

- ఆస్పత్రులకు క్యూ కడుతున్న రోగులు
- నర్సంపేటలో 16 డెంగీ పాజిటివ్ కేసులు
- గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

నర్సంపేట రూరల్: రోజురోజుకూ వర్షాలు పెరుగుతుండటంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. నర్సంపేట భాంజీపేట ఆధ్వర్యంలో 10 డెంగీ పాజిటివ్, పీపీ యూనిట్ నర్సంపేట ఆధ్వర్యంలో 6 డెంగీ కేసులు నమోదు కావడంతో వైద్యాధికారులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జాగ్రత్తలు తీసుకోవాలని వివరిస్తున్నారు. గతనెలలో డెంగీతో ఓ చిన్నారి మృతి చెందడంతో అలాంటి పరిస్థితి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నర్సంపేట మండలంలోని భానోజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 21 గ్రామాలు, పట్టణంలోని 24 వార్డులు వస్తాయి. ఈ పీహెచ్‌సీ పరిధిలో 7 పల్లె దవాఖానాలు, 12 సబ్ సెంటర్లను ఏర్పాటుచేసి ప్రజలకు నిరంతరం వైద్య సేవలందిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ సర్వే నిర్వహిస్తూ జ్వర పీడితులకు మందులను అందిస్తున్నారు. మెరుగైన వైద్యసేవలు అందించేందుకు బానోజీపేట పీహెచ్‌సీ, నర్సంపేట జిల్లా ఆస్పత్రులకు తరలిస్తున్నారు.

నర్సంపేటలో 16 డెంగీ పాజిటివ్ కేసులు...

మండలంలోని 21 గ్రామాలతో పాటు, పట్టణంలోని 24 వార్డుల్లో మొత్తం కలిపి 16 డెంగీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. డెంగీ సంబంధించి పూర్తి వివరాలను ఏఎన్ఎం, ఆశల వద్ద నుంచి బానోజీపేట పీహెచ్‌సి వైద్యాధికారి అరుణ్‌చంద్ర తెప్పించుకొని ఉన్నతాధికారులకు నివేదించడంతో వెంటనే డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాశ్, స్థానిక వైద్యాధికారితో కలిసి వెళ్లి ఆ ఇంటి పరిసరాలను పరిశీలించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. గత ఆగస్టు 8న నర్సంపేటలోని 23వ వా ర్డుకు చెందిన గండికోట నందిని డెంగీతో మృతి చెందింది.



డెంగీ పాజిటివ్ వచ్చిన ఇంటి వద్ద మున్సిపాలిటీ సిబ్బందితో ఫాగింగ్ చేయిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)



డెంగీ పాజిటివ్ వచ్చిన వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న డీడీఎంహెచ్ఓ ప్రకాశ్ (ఫైల్)

ఆస్పత్రులకు పెరిగిన ఓపీ సంఖ్య...

బానోజీపేట పీహెచ్‌సీలో ప్రతి రోజు 80 నుంచి 100 వరకు ఓపీ వస్తోందని, అదేవిధంగా ఏడు పల్లె దవాఖానలో ప్రతి రోజు 25 నుంచి 35 వరకు వస్తోందన్నారు. గతంతో పోలిస్తే ఓపీ సంఖ్య డబుల్ అయింది. అంతేకాకుండా జిల్లా ఆస్పత్రికి ఎక్కువ శాతం రోగులు వెళ్తుంటారు. జ్వరం పీడితులు ఎక్కువగా ఉంటే పీహెచ్‌సీ వైద్యాధికారి దృష్టికి తీసుకొచ్చి ప్రత్యేకంగా క్యాంప్‌లను ఏర్పాటు చేయిస్తున్నారు. అవసరమైన వారికి ఉచితంగా రక్త, మూత్ర పరీక్షలకు నర్సంపేట తెలంగాణ డయోగ్నోస్టిక్స్ హబ్‌కు పంపిస్తున్నారు. రిపోర్ట్స్ ఆధారంగా వారికి వైద్యసేవలు అందిస్తున్నారు.

సీజన్‌తో పెరుగుతున్న డెంగీ కేసులు ...

ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోజు రోజుకు డెంగీ కేసులు పెరుగుతూ వస్తున్నాయి. వరంగల్ జిల్లా పరిధిలో ఆగస్టు, సెప్టెంబర్ నెలలో మొత్తం 121 కేసులు నమోదయ్యాయి. జిల్లా పరిధిలో 13 మండలాలు, వరంగల్, నర్సంపేట, మున్సిపాలిటి పరిధిలో ఆగస్టులో 1485 డెంగీ పరీక్షలు నిర్వహించగా 88 పాజిటివ్, సెప్టెంబర్ 9వ వరకు 604 పరీక్షలు నిర్వహించగా 33 కేసులు నమోదయ్యాయి. వీటికోసం ప్రత్యేక క్యాంప్‌లు ఏర్పాటు చేయడంతో పాటు ఫాగింగ్, పిచికారీ లాంటి చర్యలు చేపడుతున్నారు.

సూచనలు ఇస్తున్నాం..



డెంగీ పాజిటివ్ కేసులు నర్సంపేటలో మొత్తం 16 వచ్చాయని, పాజిటివ్ రాగానే ఏఎన్ఎం, ఆశలతో రిపోర్టులు తెప్పించి ఉన్నతాధికారులు నివేదిస్తున్నాం. ప్రతి రోజు వారిని ఇంటికి వెళ్లి రోగి పరిస్థితులను మా ఏఎన్ఎం, ఆశలు అ డిగి తెలుసుకుంటున్నాం. డీఎంహెచ్ఓ, డిప్యూటీ డీఎంహెచ్‌లతో కలిసి తగిన సూచనలు సలహాలు ఇస్తున్నాం.

– అరుణ్‌చంద్ర, బానోజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి

ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశాం

గత 15 రోజులుగా కురుస్తున్న వర్షాలకు డెంగీ పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయి. వారి ఇంటి వద్ద పిచికారీ, ఫాగింగ్ లాంటి చర్యలు తీసుకుంటున్నాం. హెల్త్ కమిషనర్, డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు రెండు టీమ్‌లను ఏర్పాటు చేశాం. రాపిడ్ రెస్పాండ్స్ టీం పాజిటివ్ కేసు నమోదు కా గానే ఆ టీం వెళ్లి వారికి సూచనలు అందిస్తుంది. టీంతో ప్రతి రోజు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఆ ఇంటికి వెళ్లి స్ప్రే చేయించడమే కాకుండా వారి రక్తనమూనాలను సేకరించి పరీక్షలు చేస్తున్నాం.

– డాక్టర్ మోహన్ సింగ్, ఎన్‌సీవీబీడీసీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్

రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

నర్సంపేట: రైతులకు రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోరబోయిన కుమారస్వామి డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం బుర్రి ఆంజనేయులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీ ప్రకారం దాదాపు 42 లక్షల మందికి పూర్తి స్థాయిలో అప్పు మాఫీ కావాల్సి ఉండగా ఇప్పటి వరకు సగం మందికి మాత్రమే రుణమాఫీ అమలు జరిగిందన్నారు. గత 15 రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భూక్య సమ్మయ్య మాట్లాడుతూ ఈ ఖరీఫ్‌లో రైతాంగానికి ఇవ్వాల్సిన రైతు భరోసాను ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో రుణమాఫీ, రైతు భరోసా అమలు చేయాలని, లేదా రైతుల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యుడు కత్తి పెద్ద కట్టయ్య, బి. మలహల్‌రావు, కట్కూరి శ్రీనివాస రెడ్డి, పెండ్యాల సారయ్య, భసిక మొగిలి, ఎస్‌కె.అన్వర్, రుద్రారపు లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి



గీసుకొండ : సభ్యత్వ నమోదు చేయిస్తున్న పార్టీ కౌన్సిల్ సభ్యుడు రాంబాబు



నర్సంపేట : సభ్యత్వ నమోదు చేయిస్తున్న బీజేపీ నాయకులు

గీసుకొండ : ప్రధాని మోదీ నాయకత్వంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినట్లు బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గట్టికొప్పుల రాంబాబు అన్నారు. ఆదివారం గ్రేటర్ వరంగల్ పరిధిలోని 16వ డివిజన్ ధర్మారంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు విస్తృతంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు సభ్యత్వ నమోదులో చురుకుగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాంప్రసాద్, గోదాసి నగేశ్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా సభ్యత్వ నమోదు

నర్సంపేట: వికసిత్ భారత్ లక్ష్యంగా సభ్యత్వ నమోదులో భాగస్వాములు కావాలని బీజేపీ జిల్లా ప్రచార కార్యదర్శి బాల్నె జగన్ పిలుపునిచ్చారు. పట్టణంలో 152వ బూత్ అధ్యక్షుడు రమేష్ పాండ్య ఆధ్వర్యంలో ఆదివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. జగన్ మాట్లాడుతూ దేశ అభివృద్ధే ధ్యేయంగా, దేశంలో వివిధ సామాజిక వర్గాల అభ్యున్నతికి ఎన్నో పథకాలను అందిస్తూ ప్రపంచంలోనే దేశాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీలో చేరాలన్నారు. నమోదు కోసం 8800002024 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చి పార్టీలో చేరాలని కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



రాయపర్తి : కేవ్లానాయక్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పెద్ది స్వప్న

వర్ధన్నపేట: మండలంలోని నల్లబెల్లికి చెందిన దుగ్యాల కిషన్‌రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ వారి కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో ప్రముఖ న్యాయవాది సహోదర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అన్నమనేని అప్పారావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, నాయకులు శోభన్‌బాబు, యగేంధర్, వేణుగోపాల్‌రావు, జ్యోతి మాధవరావు, ప్రవంతి, అంజన్‌రావు, సురేష్, తిరుపతి, వేమనచారి తదితరులు ఉన్నారు.

గీసుకొండ : మండలంలోని మచ్చాపురం గ్రామానికి చెందిన సంగినేని భిక్షపతి గత కొద్ది రోజుల క్రితం మరణించగా ఆదివారం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని తెలిపారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ పోలీస్ ధర్మారావు, మండల పార్టీ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బోడకుంట్ల ప్రకాశ్, మండల నాయకులు జైపాల్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, కోటి ఉన్నారు.

చెన్నారావుపేట: మండలంలోని ఉప్పరపల్లికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పెరుమాండ్ల ప్రభాకర్‌రెడ్డి తల్లి వెంకటమ్మ ప్రథమ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న హాజరై మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె వెంట మాజీ సర్పంచ్ పెరుమాండ్ల శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ విజేందర్‌రెడ్డి, నాయకులు పవన్ ఉన్నారు.

రాయపర్తి : మండలంలోని కొండాపురం, బంధనపల్లి, రాయపర్తి గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలను పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పరామర్శించారు. కొండాపురం గ్రామానికి చెందిన ఎండీ ఖలీల్, గాదె సాయిరెడ్డి, బంధనపల్లికి చెందిన లడే బుచ్చమ్మ, చిమ్మ యాదమ్మ, రాయపర్తికి చెందిన కక్కెర్ల కొంరయ్యలు మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. ఆమె వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, విజయపాల్ రెడ్డి,వనజారాణి, సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ తండ్రి కేవ్లానాయక్ మృతి చెందగా ఆదివారం మండలంలోని బాలాజీతండాకు ప్రముఖులు చేరుకొని శంకర్‌నాయక్, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్ నాయక్, వారి అన్నదమ్ములను పరామర్శించారు. పాలకుర్తి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, మాజీ జెడ్పీఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న, బలరాంనాయక్‌లు పరామర్శించారు. వారి వెంట ఆయా పార్టీల నాయకులు ఉన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ తెరిపించండి



నిరుపయోగంగా ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్

ఐనవోలు: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్ మూతపడటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటర్ ప్లాంట్‌ను రిపేర్ చేయించి సామాన్య ప్రజలకు అందుబాటులోకి తేవాలని జీపీ అధికారులను ఎన్నిసార్లు కోరినా.. సాకులు చెబుతూ కాలం వెల్లదీస్తున్నట్లుగా గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో కార్యదర్శి, స్పెషల్ ఆఫీసర్ ఇష్టా రీతిగా వ్యవహరిస్తూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు ఇకనైనా పట్టించుకుని సామాన్య ప్రజలకు గతంలో మాదిరిగా నాణ్యమైన మినరల్ వాటర్ అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. జీపీ అధికారులు పట్టించుకోకపోతే మండల, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లుగా జీఎంపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి నల్లబెట్ల చిన్నరాజు హెచ్చరిస్తున్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి



బుర్ర సరిత(ఫైల్)

ఐనవోలు: రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగిన మహిళ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందిన ఘటన మండలంలోని లింగమోరిగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బుర్ర సరిత(38) అనారోగ్య కారణాలతో తీవ్రంగా బాధపడుతుండేది. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. సరితకు భర్త శ్రీహరి, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతురాలి తండ్రి వడ్లకొండ కొంరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆస్పత్రి వద్ద టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, నాయకులు మారెపల్లి వెంకటరెడ్డి, బుర్ర రాజశేఖర్ తదితరులు నివాళులర్పించారు.

కేంద్రమంత్రిని కలిసిన బీజేపీ నాయకులు




కేంద్రమంత్రి బండి సంజయ్‌తో బీజేపీ నేతలు

పరకాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ వెళ్తున్న క్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను పరకాల అంబేడ్కర్ కూడలిలో బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోశ్‌కుమార్, జిల్లా కార్యదర్శి ఎర్ర రామన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి గాజుల నిరంజన్, నాయకులు భాస్కరాచారి, సూర్యదేవర సదానందం, ఆకుల రాంబాబు, మిడిదొడ్డి నరేశ్, జనార్దన్, ఆకుల శ్రీధర్, పాలకుర్తి ప్రతాప్, ముత్యాల దేవేందర్, దామ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

దామెర: మండలానికి చెందిన బీజేపీ నాయకులు ఆదివారం కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మహాదేవ్‌పూర్ పర్యటనలో భాగంగా బండి సంజయ్ మండలంలోని దుర్గంపేట్ సమీపంలోని ఎస్ఎస్ఆర్ హోటల్‌లో స్వల్ప విరామంకోసం ఆగారు. ఈ సందర్భంగా దామెర మాజీ సర్పంచ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి, నాయకులు పొడాల మధుకర్, గండు అన్వేశ్, ముఖేశ్, పరుశరామ్, చెల్పూరి రాజు తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు.

చివరి ఆయకట్టుకు నీరందక ఇబ్బందులు



తుంగబంధం చివరి ఆయకట్టుకు వెళ్లే కాల్వ



ఎండిన వరి పంటను చూపిస్తున్న రైతు

ఖానాపురం : మండల పరిధిలోని తుంగబంధం కాల్వ అధ్వానంగా ఉండడంతో కాల్వ కింద చివరి ఆయకట్టుకు నీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. తుంగబంధం పరిధిలోని దుంపిల్ల పాయ పరిధిలో కొత్తూరు, రంగాపురం గ్రామాలకు చెందిన రైతులు సుమారు 200 ఎకరాల మేర పంటలు సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో నీరు అందక భూములు నెర్రెలు బారుతున్నాయని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాకాల సరస్సు పూర్తిస్థాయిలో నిండడంతో మత్తడి పోస్తున్నప్పటికీ చివరి ఆయకట్టుకు నీరందని దుస్థితి నెలకొందని రైతులు తెలిపారు. కాల్వలు శుభ్రం చేసి పంటలకు నీరందించాలని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్తే పట్టించుకోవడం లేదని, పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని రైతులు వాపోయారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్యను సత్వరమే పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

ఎన్నికల హామీని నెరవేర్చాలి



ఎమ్మెల్యే రేవూరికి వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

పరకాల: ఎన్నికల సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రేషన్‌డీలర్లకు రూ.5వేల వేతనం అమలు జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావాలని రేషన్ డీలర్లు డిమాండ్ చేశారు. ఆదివారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. తక్షణమే తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరకాల నియోజకవర్గంలోని ఆత్మకూరు, దామెర, గీసుగొండ, పరకాల, సంగెం, నడికూడ రేషన్ సంఘం అధ్యక్షులు వాణి రాజు, పోచయ్య, శంకర్‌రావు, రాజేందర్‌రెడ్డి, ఉమేందర్‌గౌడ్, సర్వేశ్వర్ పాల్గొన్నారు.

తిమ్మంపేటలో అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

దుగ్గొండి: మండలంలోని తిమ్మంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997–98 సంవత్సరంలో టెన్త్ పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 26 ఏళ్ల క్రితం విడిపోయి ఎక్కడెక్కడో స్థిరపడినవారంతా ఒక్కచోట కలిసి కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి స్మృతులను నెమరువేసుకున్నారు. నాటి గురువులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కష్టాల్లో ఉన్న మిత్రులను ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నల్లబెల్లి సుధాకర్, కొలిపాక భాస్కర్, రమేశ్, చెల్ల యువరాజు, నల్లగొండ దామోదర్, కృష్ణ, రజిత, తోటకూరి లావణ్య, తదితరులు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు



మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి కమ్ముకున్నాయి. ఆ పొదల్లో ట్రాన్స్‌ఫార్మర్ ఉందని తెలియకుండా అల్లుకుపోయాయి. పైగా స్తంభంపైన తీగలకు చెట్టుకొమ్మలు అల్లుకుని పోయాయి. దీంతో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. – సంగెం

ప్రశ్నించాల్సిన అధికారి పేరు : మధుసూదన్, ట్రాన్స్‌కో ఏఈ
ఫోన్‌నంబర్: 94408 11364